




సత్యం మందపాటి

## మీకు తెలుసని నాకు తెలుసు 21

ఈ 'మీకు తెలుసని నాకు తెలుసు' శీర్షిక మొదలుపెట్టి ఇప్పటికి మూడ్నెల్లు తక్కువ రెండేళ్ళు..!, అంటే రచన శాయిగారు అన్నట్టు ఒక్కసారి కూడా 'నెల తప్పకుండా' నెలనెలా 21 నెలల నించీ వస్తున్నది. కిరణ్‌ప్రభగారి సమాచారం ప్రకారం, ఎక్కువ మంది పాఠకులు చదువుతున్న శీర్షికలలో ఇదొకటి. నేను ఈ శీర్షిక నడపటానికి మూడు ముఖ్య కారణాలు. మన చక్కటి తెలుగు సాహిత్యాన్ని మరిచిపోకుండా మరోసారి నేను గుర్తు చేసుకుంటూ, మీకు గుర్తు చేయటానికి ఇదొక మంచి మార్గం. (వంక అన్నా నాకభ్యంతరం లేదు). రెండవది సుజనరంజని పత్రిక. ఇంత చక్కటి వెబ్ పత్రిక మన తెలుగులో లేదు. రచనల విలువ, రచయితలకిచ్చే గౌరవం, కంటికింపైన గ్రాఫిక్స్, పాఠకుల ఫోన్ కాల్స్ నాకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చాయి. మూడవది కిరణ్‌ప్రభగారు. ఒక హైటెక్ కంపెనీలో ఎక్జిక్యూటివ్‌గా పనిచేస్తూ, ఇంత చక్కటి పత్రికని నెలనెలా తీసుకురావటానికి పది వేళ్ళూ, ఒక కీబోర్డూ చాలవు, దీనికోసమే పూర్తిగా ఆయన అంకితమయిపోతే తప్ప. నేను చెప్పేది మానిటర్ మీద కనపడే ఆయన శ్రమే కాదు, రచయితలకి ఫోన్ చేసి మరీ స్పందన నివ్వటంలాటి మానిటర్ మీద కనపడనివి కూడాను.

ఎవరినీ నిరుత్సాహ పరచటం నా ఉద్దేశ్యం కాదు కానీ, దీనికింతటితో మంగళం పాడి ముగిస్తే బావుంటుం దనిపించింది. కొన్ని కథల ద్వారానో, కవితల ద్వారానో మళ్ళీ తప్పకుండా కలుస్తూనే వుందాం. అందుకే ముఖ్యంగా కిరణ్‌ప్రభగారికీ, పాఠకులకీ నా ధన్యవాదాలు.

## చలం కలకలం

ఇరవయ్యో శతాబ్దం మొదట్లోనే తెలుగు సాహిత్యంలో తలెత్తిన విప్లవ తరంగం చలం. ఆయన ప్రతి రచనా ఒక సంచలనమే.. ఆయన రాసిన ప్రతివాక్యం ఒక కలకలమే..! ఆయనని అభిమానించే వారికీ, విమర్శించే వారికీ కూడా నచ్చేది ఆయన భావాల్లోని తీవ్రత, పదును. ప్రేమలేఖలు రాసినా. మ్యూజింగ్స్ రాసినా, బిడ్డల శిక్షణ రాసినా, నిర్భయమైన ప్రణయ భావాలతో అనేక నవలలు రాసినా, నాటకాలు రాసినా..ఎందులోనైనా ఆయన ముద్ర కనిపిస్తుంది. ఆయన వాక్యాలు అనేకం నిలదీసి ప్రశ్నిస్తాయి, మనసుని ఆలోచనల సుడిగుండల్లోకి నెట్టేస్తాయి. మచ్చుకి ఆయన రాసిన కొన్ని వాక్యాలనిక్కడ ఇస్తున్నాను..ఇవి చలం రాసిన ఏ రచనలోవో..మీకు ఖచ్చితంగా తెలుసు కాబట్టి సమాధానాలు కూడా ఈ సంచికలోనే ఇచ్చేస్తూ..ఈ శీర్షికకి ముగింపు పలుకుతున్నాను.

1.ఆత్మహత్య ఎప్పుడూ అపజయ చిహ్నమే! ఎంత జారుడుగా వున్నా, సర్పాలు చుట్టుకున్నా, వొడ్డునించే కొలవగలవారు అంతకన్నా ధీరులు.

2.వితంతు వివాహాలు సాధించిన వీరేశలింగం గారు, స్త్రీ నీతి చట్టాల్ని వెక్కిరించిన 'చలం' కి spirtual father.

3. నా చూపులో కట్టుబడి
నీ చూపుని ఆపు
నీ చూపు కదిలిందా
నీ మనసు కదులుతుంది
నీ మనసు కదిలిందా
ప్రపంచాలే కదులుతాయి..!

4. ముందు తనని ప్రేమించుకోనివాడు, లోకంలో ఎవరినీ ప్రేమించలేడు

5.కొందరు వరం పొంది పుడతారు, ఏ అవస్థలోనైనా బట్టలు వుండి, బట్టలు లేక, నవ్వులో, ఏడుపులో, మురికిలో, షోకులో, కోపంలో, మోహంలో, ఎప్పుడూ ఆకర్షకంగా వుండేందుకు.

6.ప్రపంచానికి వెలుగు నిచ్చిన ప్రతిమనిషీ నిప్పుల్లోంచి నడిచాడు. కానీ నిప్పుల్లోంచి నడిచిన ప్రతిమనిషినించీ వెలుగు రాలేదు.

7. మానవుడ్ని మాధవుడిగా చూసినప్పుడే మానవసేవ మాధవసేవ అవుతుంది.

8. హరిశ్చంద్రుణ్ణి స్టేజి మీద అందరూ మెచ్చుకుంటారు గాని అట్లాంటి వాడు ఒకడు ఇంట్లో వుంటే గదికి తాళం వేస్తారు

9. గురువునుంచీ శిష్యులు తాము నేర్చుకునే విద్యపైన ప్రేమ, అభిమానమూ ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తి, ఇవే గాక ధైర్యమూ, స్వాభిమానమూ , ఆత్మ గౌరవమూ, ఉన్నతమైన విలువలూ character సంపాదించాలి

10. బాధపడాలి, నలగాలి, జీవిత రథచక్రాల కింద, కలంలోంచి నెత్తురు వొలకాలంటే! అక్షరాలా, పాండిత్యమా, కాదు. సంవత్సరాల మూగవేదన, అంధకారంలో అన్వేషణ, నాబోటి దీనజీవుల రహస్య

హృదయాంతర విషాదం, దిక్కులేని దుర్బలుల జీర్ణ ఆవేశం - ఎవరితోనూ చెప్పుకోలేని అధమ చారిత్రల గర్భశోకం..! - యిదీ నా శైలి..!

గతనెల మీకు తెలుసని నాకు తెలుసు-20 జవాబులు

1. అంతరాత్మ అంత్యక్రియలు

బొల్లిముంత శివరామకృష్ణ

2. ఎన్నో రంగుల తెల్లకిరణం

సిరివెన్నెల సీతారామ శాస్త్రి

3. ఊరి చివర ఇల్లు

తిలక్

4. ఎ మాటర్ ఆఫ్ నో ఇంపార్టెన్స్

బీనాదేవి

5. ఓ పువ్వు పూసింది

చలం

6. కార్నర్ సీట్

రావిశాస్త్రి

7. గాజుపాలెం గాంధీ

మొక్కపాటి నరసింహ శాస్త్రి

8. క్రోటన్ మొక్కలు

పరిమళా సోమేశ్వర్

9. కూలిన శిఖరాలు

అమరేంద్ర

10. నన్ను గురించి కథ వ్రాయవూ?

బుచ్చిబాబు

## ఈ నెల మీకు తెలుసని నాకు తెలుసు-21 జవాబులు

1. అరుణ (నవల)
2. మ్యూజింగ్స్-2 (వ్యాసాలు)
3. సుధ (కావ్యం)
4. బిడ్డలశిక్షణ (వ్యాసాలు)
5. అరుణ (నవల)
6. విషాదం (వ్యాసాలు)
7. నిర్వికల్పం(వ్యాసాలు)
8. కోపమెందుకు?(హరిశ్చంద్రనాటకానికి ఉపోద్ఘాతం)
9. మ్యూజింగ్స్-3(వ్యాసాలు)
10. ప్రేమలేఖలు

జనవరి 2006 - మీ సుజనరంజని 25 వ సంచిక..!!ఈ సంచికనుంచీ ఆకర్షణీయమైన శీర్షికలు మరిన్ని ఆరంభమౌతున్నాయి..కొన్నింటిలో మీరూ పాల్గొనండి..వివరాలకోసం ఇక్కడ క్లిక్ చేయండి